సాక్షి

డా. బి ఆర్ అంబేడ్కర్ కోనసీమ

శుక్రవారం । 17 । అక్టోబర్ । 2025



రూ.1,01,116 విరాళం

అయినవిల్లి: విఘ్నేశ్వరస్వామి ఆలయంలో నిత్యాన్నదాన పథకానికి బొడ్డు అనసూయ (కొవ్వూరు) గురువారం రూ.1,01,116 విరాళం సమర్పించారు.



సదా వేంకటేశం.. స్మరామి స్మరామి

కోనసీమ తిరుమలగా ఖ్యాతికెక్కిన వాడపల్లి క్షేత్రంలో శ్రీ, భూ సమేత శ్రీ వేంకటేశ్వర స్వామివారి బ్రహ్మోత్సవాలు ఆబాల గోపాలాన్ని మురిపిస్తున్నాయి.

II లో

మిగులు జలాల విడుదల



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి గురువారం 2,13,627 క్యూసెక్కుల మిగులు జలాలను సముద్రంలోకి విడిచిపెట్టారు. అలాగే తూర్పు డెల్టాకు 2,700, మధ్య డెల్టాకు 1,400, పశ్చిమ డెల్టాకు 6 వేల క్యూసెక్కులు వదిలారు. బ్యారేజీ వద్ద 10, భద్రాచలం వద్ద 20 అడుగులుగా నీటి మట్టాలు నమోదయ్యాయి.

న్యూస్‌రీల్

సమర్థవంతంగా భూముల రీసర్వే చేపట్టండి



పి.మల్లవరంలో భూముల రీసర్వేను పరిశీలిస్తున్న సూర్యారావు

తాళ్లరేవు: ప్రభుత్వం నిర్వహిస్తున్న భూముల రీసర్వే ప్రక్రియను రైతులకు ఎటువంటి అసౌకర్యం లేకుండా, పూర్తి పారదర్శకంగా నిర్వహించాలని ల్యాండ్ సర్వే డిపార్ట్‌మెంట్ డిప్యూటీ డైరెక్టర్ కె.సూర్యారావు తెలిపారు. గురువారం తాళ్లరేవు మండలం పి.మల్లవరం పంచాయతీలో జరుగుతున్న రీసర్వేను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా సూర్యారావు మాట్లాడుతూ భూముల రీసర్వేకు సంబంధించి మూడు రోజుల ముందు రైతులకు సమాచారం ఇవ్వాలన్నారు. రైతుల సమక్షంలో వారి సరిహద్దులను పరిశీలించి, ఎటువంటి వివాదాలకు తావులేకుండా చూడాలని ఆదేశించారు. కాకినాడ జిల్లా ల్యాండ్ సర్వే ఆఫీసర్ కె.శ్రీనివాస్, డీఐఓఎస్ రవి శంకర్, గ్రామ సర్పంచ్ పంపన రామకృష్ణ, మండల సర్వేయర్ సీహెచ్ నిరంజన్‌రావు, రీసర్వే డీటీ కె.వీరబాబు, డీటీ టి.సూరిబాబు, సర్పంచ్ పంపన రామకృష్ణ పాల్గొన్నారు.

నేడు నూతన ఉపాధ్యాయుల పరిచయ కార్యక్రమం

అమలాపురం రూరల్: జిల్లాలో కొత్తగా నియమితులైన ఉపాధ్యాయుల పరిచయ కార్యక్రమం శుక్రవారం అమలాపురం కలెక్టరేట్ గోదావరి భవనంలో నిర్వహిస్తున్నట్లు డీఈఓ సలీమ్ బాషా తెలిపారు. జిల్లాలో 414 మంది ఉపాధ్యాయులకు కలెక్టర్ మహేష్ కుమార్ మార్గదర్శక ప్రసంగం అందిస్తారన్నారు. విద్యారంగంలో ఉన్న అవకాశాలు, సవాళ్లు, విద్యార్థుల అభ్యాసన ప్రమాణాలను మెరుగుపరచడంలో ఉపాధ్యాయుల పాత్రపై కలెక్టర్ దిశానిర్దేశం చేయనున్నారు. కార్యక్రమానికి జిల్లా స్థాయిలో విద్యాశాఖ, సమగ్ర శిక్ష, సర్వశిక్ష అభియాన్ తదితర శాఖల ప్రధానాధికారులను ఆహ్వానించారు.

అనుమతి లేకుండా బాణసంచా విక్రయిస్తే చర్యలు



పి.గన్నవరం పోలీస్ స్టేషన్‌లో రికార్డులను పరిశీలిస్తున్న ఎస్పీ రాహుల్ మీనా

పి.గన్నవరం: జిల్లాలో అనుమతులు లేకుండా బాణసంచా విక్రయిస్తున్న వ్యక్తులపై ఇప్పటి వరకూ 50 కేసులు నమోదు చేసినట్లు జిల్లా ఎస్పీ రాహుల్ మీనా తెలిపారు. పి.గన్నవరం పోలీస్ స్టేషన్‌ను గురువారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్టేషన్‌లో రికార్డులతో పాటు వివిధ అంశాలను పరిశీలించారు. అనుమతులు లేకుండా బాణసంచా విక్రయిస్తే చర్యలు తీసుకుంటామని ఎస్పీ హెచ్చరించారు. అమలాపురం సెంటర్లో ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు ప్రత్యేక చర్యలు చేపట్టామన్నారు. 216 నేషనల్ హైవేలో భట్నవిల్లి నుంచి చించినాడ వరకూ పలు కూడళ్లలో ప్రమాదాల నియంత్రణకు హైవే అధికారులతో చర్చించి రక్షణ చర్యలు తీసుకుంటామన్నారు. ఆయన వెంట ఎస్సై బి.శివకృష్ణ ఉన్నారు.

జిల్లా ఫొటోగ్రాఫర్లకు సేఫ్టీ ఐడీ



సేఫ్టీ ఐడీ క్యూఆర్ కోడ్ లింక్‌ను ఆవిష్కరిస్తున్న ఎస్పీ రాహుల్ మీనా, తాతాజీ తదితరులు

అమలాపురం టౌన్: జిల్లా ప్రొఫెషనల్ ఫొటోగ్రాఫర్స్ అండ్ వీడియో గ్రాఫర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ తమ వృత్తి నిపుణుల భద్రత కోసం సేఫ్టీ ఐడీ స్టిక్కర్ అనే వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. అత్యవసర పరిస్థితుల్లో తక్షణ సహాయం అందించే లక్ష్యంతో రూపొందించిన ఈ సేఫ్టీ ఐడీ స్టిక్కర్ క్యూఆర్ కోడ్ లింక్‌ను స్థానిక ఎస్పీ కార్యాలయంలో జిల్లా ఎస్పీ రాహుల్ మీనా గురువారం ప్రారంభించారు. ఈ క్యూఆర్ కోడ్‌ను జిల్లాలోని ఫొటో, వీడియో గ్రాఫర్లు సద్వినియోగం చేసుకోవాలని ఎస్పీ సూచించారు. ఈ క్యూఆర్ కోడ్‌ను ఫొటోగ్రాఫర్లు తమ వాహనం (బైక్ లేదా కారు)పై అతికించుకోవాలని జిల్లా అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు, పట్టణ చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు కల్వకొలను తాతాజీ అన్నారు. జిల్లా అసోసియేషన్ అధ్యక్షుడు గెద్దం సురేష్‌కుమార్, కార్యదర్శి దొరబాబు, కార్యనిర్వాహక కార్యదర్శి గీత రమణ పాల్గొన్నారు.

చితికిపోయినా..

సాయం చేసే చేతులేవీ..?

- ప్రభుత్వ తీరుపై సర్వత్రా విస్మయం
- పది మంది ప్రాణాలు పోయినా పరిహారానికి మీనమేషాలు
- ఎదురుతెన్నులు చూస్తున్న బాధిత కుటుంబాలు
- సర్కార్‌కు ఎన్‌హెచ్‌ఆర్సీ నోటీసులు
- జగన్ హయాంలో 24 గంటల్లోనే సాయం



రాయవరం మండలం సోమేశ్వరంలో విజయలక్ష్మిని కోల్పోయి రోదిస్తున్న కుటుంబ సభ్యులు

సాక్షి, ప్రతినిధి, కాకినాడ: కూటమి ప్రభుత్వానికి మానవత్వం లేకుండా పోతోంది. ప్రజలకు కష్టం వస్తే ఆదుకోవాల్సిన బాధ్యతను విస్మరిస్తోంది. తాజాగా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రాయవరంలో సంభవించిన బాణసంచా విస్ఫోటంలో ప్రాణాలు కోల్పోయిన పది మందిలో బాణసంచా తయారీ దుకాణం యజమాని తప్ప మిగిలిన వారంతా రెక్కాడితే కానీ డొక్కాడని వారే. ఈ పెను విషాదం జరిగి వారం రోజులు గడిచినా మంత్రులు, ఎమ్మెల్యేలు వచ్చి నాలుగు మాటలు చెప్పి వెళ్లడమే తప్ప తక్షణ సాయం అందించే దిశగా ఎటువంటి చర్యలు లేవు. రాష్ట్రంలోని పల్నాడు జిల్లాలో ఎప్పుడో ఓ టీడీపీ కార్యకర్త హత్యకు గురైతే ఆ కుటుంబంలో ఒకరికి ప్రత్యేక ఉత్తర్వులు ఇచ్చి ప్రభుత్వ ఉద్యోగం కల్పించింది. అదే ఉదారత రాయవరం ఘటనలో ప్రాణాలు కోల్పోయిన వారిపై లేకపోవడం ఏంటని విజ్ఞులు ప్రశ్నిస్తున్నారు. ఇదే విషయాన్ని బుధవారం రాయవరం తహసీల్దార్ కార్యాలయం వద్ద ప్రజా సంఘాలు ధర్నాకు దిగి అధికారులను నిలదీశాయి.

ఈ దుర్ఘటనలో బిక్కవోలు మండలం కొమరిపాలేనికి చెందిన బాణసంచా యూనిట్ యజమాని వెలుగుబంట్ల సత్యనారాయణమూర్తి (సత్తిబాబు) మినహాయిస్తే మిగిలిన వారంతా పొట్టకూటి కోసం బాణసంచా తయారీకి వచ్చిన వారే. కొమరిపాలేనికి చెందిన పొట్నూరి వెంకటరమణ, రాయవరం మండలం సోమేశ్వరం గ్రామానికి చెందిన పాకా అరుణ, వాసంశెట్టి విజయలక్ష్మి, అనపర్తికి చెందిన చిట్టూరి శ్యామల, చిట్టూరి యామిని, అనపర్తి సావరానికి చెందిన కుడుపూడి జ్యోతి, పెంకే శేషారత్నం, కొమరిపాలెం, పెదపూడి మండలం వేండ్రకు చెందిన లింగం వెంకటకృష్ణ, ఒడిశాకు చెందిన కె.సదానందం మృతులు. యజమాని మినహా మిగిలిన వారంతా ఎస్సీ, బీసీ సామాజికవర్గాల వారే. తమ ప్రభుత్వం ఎస్సీ, బీసీలకు అగ్రాసనం వేస్తుందని గొప్పగా చెప్పుకొనే సర్కార్ కనీసం వారిని ఆదుకోవాలని ఆలోచించకపోవడం విమర్శలకు తావిస్తోంది. ఘటన జరిగిన రోజు రాష్ట్ర హోంశాఖా మంత్రి వంగలపూడి అనిత, కార్మికశాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ సంఘటనా స్థలానికి వచ్చి పరిశీలించి వెళ్లారే తప్ప ఎటువంటి సాయం ప్రకటించకపోవడంతో బాధిత కుటుంబ సభ్యులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. అలా కాదని సాయం కోసం ప్రశ్నిస్తే ఇచ్చే సాయం ఇవ్వరేమోననే భయం వారిని మాట్లాడనీయలేదు. వారిని పక్కనబెడితే కూటమి నేతలైన మండపేట, అనపర్తి ఎమ్మెల్యేలు వేగుళ్ల జోగేశ్వరరావు, నల్లమిల్లి రామకృష్ణారెడ్డి బాధిత కుటుంబాలను పలకరించి ప్రభుత్వ పరంగా న్యాయం చేసేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారే తప్ప ప్రభుత్వం ఇచ్చే పరిహారాన్ని ఎక్కడా ప్రస్తావించకపోవడం విస్మయానికి గురిచేసింది. అసలు సంఘటన జరిగిన రోజు వచ్చిన సందర్భంలోనే మంత్రులు ప్రభుత్వ సాయాన్ని ప్రకటించాల్సి ఉంది. అలా కాకుండా ఈ ఘటనపై సమీక్షించిన తరువాత అయినా ఆర్థిక సాయాన్ని ప్రకటించాల్సి ఉంది. కాగా బీజేపీ ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి మాత్రం జ్యుడీషియల్, ప్రభుత్వం వైపు నుంచి విచారణ జరుగుతోంది, పరిహారం ఎలా ఇవ్వాలనేది ఆలోచిస్తున్నారని చెబుతున్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వ కాలయాపనపై ప్రజా సంఘాలు కార్మిక న్యాయస్థానానికి వెళ్లేందుకు సిద్ధపడుతున్నాయి.

కాగా, ఈ దుర్ఘటనపై జాతీయ మానవ హక్కుల కమిషన్ తనంతట తానుగా మంగళవారం కేసు నమోదుచేస్తున్నట్టు ప్రకటించడం చర్చనీయాంశమైంది. ఈ ఘటనకు కారణాలను ఎన్‌హెచ్‌ఆర్సీ ప్రశ్నించింది. మీడియా కథనాల ఆధారంగా కేసు నమోదు చేసి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, డీజీపీలకు నోటీసులు జారీ చేస్తున్నట్టు ప్రకటించింది. బాధితుల సమీప బంధువులకు పరిహారం అందించారా అనే విషయాన్ని కూడా రెండు వారాల్లో అందించే నివేదికలో పొందుపరచాలని ఆదేశించింది. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో అత్యంత విషాదకర ఘటనగా నిలిచిపోయిన వాకతిప్ప బాణసంచా పేలుడు 2014 అక్టోబర్ 10వ తేదీన జరిగింది. ఆ దుర్ఘటనలో 18 మంది మృతి చెందారు. నాడు ప్రతిపక్ష నేతగా జగన్ ఒక్కో కుటుంబానికి రూ.50 వేల సొంత నిధులు అందించి ఆదుకున్నారు. అప్పట్లో అధికారంలో ఉన్న చంద్రబాబు సర్కార్ తొలుత లక్షన్నర పరిహారం ప్రకటించింది. జగన్ వచ్చి వెళ్లాక ఆర్థిక సాయాన్ని రూ.3 లక్షలు చేసింది. జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో ఇలాంటి ఘటనలు జరిగినపుడు ప్రభుత్వం మానవత్వంతో ఆదుకున్న ఉదంతాలు కోకొల్లలు. సామర్లకోట మండలం జి. మేడపాడులో 2019 అక్టోబర్‌లో బాణసంచా తయారు చేస్తుండగా జరిగిన ప్రమాదంలో ఆరుగురు ప్రాణాలు కోల్పోయారు. అప్పట్లో మృతుల కుటుంబాలకు జగన్ ప్రభుత్వం సుమారు రూ.15 లక్షల సాయం అందించింది. రంపచోడవరం మన్యం ప్రాంతంలో కచ్చులూరు వద్ద 2019లో పాపికొండలకు వెళ్లే పర్యాటక బోటు బోల్తా పడిన సంఘటనలో 48 మంది మృత్యువాత పడ్డారు. బాధిత కుటుంబాలకు రూ.10 లక్షల చొప్పున సాయం అందించింది. అలాగే తాళ్లరేవు మండలం జి.వేమవరంలో బాణసంచా పేలుడు ఘటనలో ముగ్గురు దుర్మరణం చెందారు. వెంటనే కుటుంబానికి రూ.5 లక్షల పరిహారాన్ని, క్షతగాత్రులకు రూ.3 లక్షలు అప్పటి వ్యవసాయ శాఖ మంత్రి కురసాల కన్నబాబు ప్రకటించారు.

నేడు ఉన్నత స్థాయి కమిటీ రాక

రాయవరం: బాణసంచా ప్రమాద ఘటనపై విచారణ నిమిత్తం ఉన్నత స్థాయి కమిటీ శుక్రవారం రాయవరం రానుంది. ఈ విషయాన్ని తహసీల్దార్ బీవీ భాస్కర్ తెలిపారు. ఉన్నత స్థాయి కమిటీలో ప్రిన్సిపల్ సెక్రటరీ టు మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్, పోలీసు శాఖ నుంచి ఇన్‌స్పెక్టర్ జనరల్ (ఐజీ) రానున్నట్లు తెలిసింది. వీరి వెంట జిల్లా అధికారులు ఉంటారు. ప్రమాద ఘటన తీరుతెన్నులను ఉన్నత స్థాయి కమిటీ పరిశీలించే అవకాశముంది. అలాగే బాధిత కుటుంబాలతో మాట్లాడిన అనంతరం ఉన్నత స్థాయి కమిటీ ప్రభుత్వానికి నివేదిక ఇవ్వనుంది.

సత్వరం పరిహారం అందించాలి



రాయవరం బాణసంచా ప్రమాద మృతులకు సాయం అందించడంలో కూటమి ప్రభుత్వం జాప్యం చేస్తోంది. ప్రమాదం జరిగి అప్పుడే వారం రోజులు గడచిపోయాయి. ఇప్పటి వరకు బాధిత కుటుంబాలకు పరిహారం ప్రకటించక పోవడం విచారకరం. బాధిత కుటుంబాలు కూడా ఆందోళనలో ఉన్నారు. తక్షణం ప్రభుత్వం పరిహారం అందించాలి.

– డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి, అనపర్తి మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కోఆర్డినేటర్

పట్టాలు ఇచ్చారు.. భూమి చూపలేదు



బాణసంచా తయారీ కేంద్రంలో ప్రమాదం జరిగి ఏళ్లు గడుస్తున్నా బాధిత కుటుంబాలకు ఇచ్చిన పట్టాలకు నేటికీ భూమిని చూపించలేదు. అక్టోబర్ పదో తేదీ 2014లో వాకతిప్పలో ఉన్న బాణసంచా తయారీ కేంద్రంలో అగ్ని ప్రమాదం జరిగి 18 మంది అక్కడికక్కడే మృతి చెందారు. వారిలో నా భార్య మనకపల్లి పుష్పావతి, మరదలు మనకపల్లి కుమారి ఉన్నారు. అప్పట్లో బాధిత కుటుంబాలకు టీడీపీ ప్రభుత్వం ఒక్కొక్కరికి 50 సెంట్ల భూమి ఇస్తానని బీ పట్టాలు ఇచ్చింది. ఆ భూమి చూపించాలని తహసీల్దార్ కార్యాలయం, స్పందనకు కాళ్లు అరిగేలా తిరుగుతూ వచ్చాం. ఏ ఒక్కరూ పట్టించుకోలేదు. ఈ పట్టాలకు సంబంధించిన భూమిని గతంలో వేరే వారికి ఇచ్చారు. వారి దగ్గర పాస్ పుస్తకాలు కూడా ఉన్నాయి. మమ్మల్ని అప్పటి ప్రభుత్వం మోసం చేసింది. ఇప్పటికైనా ప్రభుత్వం బాధిత కుటుంబాలకు ఇస్తానన్న 50 సెంట్ల భూమిని ఇవ్వాలి.

– మనకపల్లి నాగేశ్వరరావు, వాగతిప్ప

ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలి



రాయవరంలో బాణసంచా తయారీ కేంద్రంలో జరిగిన పేలుడు ఘటనలో గాయపడిన నా కుమారుడు లింగం వెంకటకృష్ణ (22) చికిత్స పొందుతూ కాకినాడ జీజీహెచ్‌లో 12న చనిపోయాడు. ప్రభుత్వం మా కుటుంబానికి పరిహారం ప్రకటించి ఆదుకోవాలి. చేతికి అందివచ్చిన కొడుకు కళ్ల ముందు చనిపోవడం చూసి, తట్టుకోలేపోతున్నాం.

– లింగం రాము, వేండ్ర, పెదపూడి మండలం

ప్రభుత్వం ఆదుకోవాలి



నా తల్లి విజయలక్ష్మిని కోల్పోయాను. ఇంత కాలం మా కుటుంబాన్ని నెట్టుకు వచ్చింది. ఈ ప్రమాదంతో దిక్కుతోచని స్థితిని ఎదుర్కొంటున్నాం. ఇప్పటి వరకు ప్రభుత్వం నుంచి ఎటువంటి సాయం అందలేదు. ప్రభుత్వం సాయం అందించి ఆదుకుంటుందని ఆశగా ఎదురుచూస్తున్నాం.

– దుర్గాదేవి, సోమేశ్వరం, రాయవరం

బాధితులను ఆదుకోవడంలో ప్రభుత్వం విఫలం

వైఎస్సార్ సీపీ కోనసీమ జిల్లా అధ్యక్షుడు జగ్గిరెడ్డి

బిక్కవోలు: రాయవరంలోని బాణసంచా తయారీ కేంద్రంలో ఇటీవల జరిగిన పేలుడు ఘటనకు సంబంధించి బాధితులను ఆదుకోవడంలో కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని వైఎస్సార్ సీపీ కోనసీమ జిల్లా అధ్యక్షుడు చిర్ల జగ్గిరెడ్డి విమర్శించారు. ఆ ఘటనలో తయారీ కేంద్రం యాజమాని వెలుగుబంట్ల సత్యనారాయణ (సత్తిబాబు), కార్మికులు మృతి చెందిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో కొమరిపాలెం గ్రామంలో సత్తిబాబు కుటుంబ సభ్యులను గురువారం జగ్గిరెడ్డి పరామర్శించారు. సత్తిబాబు చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ పేలుడు ఘటన దురదృష్టకరమన్నారు. సంఘటన జరిగిన తొమ్మిది రోజులు గడిచినా ప్రభుత్వం బాధితులకు నష్ట పరిహారం ప్రకటించపోవడం దారుణమన్నారు. రాయవరం ఎంపీపీ నౌడు వెంకట రమణ, పార్టీ రాయవరం మండల కన్వీనర్ తమలంపూడి గంగాధర్‌రెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ సిరపురపు శ్రీనివాసరావు, కర్రి నాగిరెడ్డి, ఆలమూరు మండల కన్వీనర్ తమ్మన శ్రీనివాస్, మోదుకూరు సర్పంచ్ పెంటపాటి వెంకన్న, కొత్తపేట నియోజకవర్గ సోషల్ మీడియా కన్వీనర్ నల్లిరాజు తదితరులు ఉన్నారు.



కొమరిపాలెంలో సత్తిబాబు చిత్రపటానికి పుష్పాంజలి ఘటిస్తున్న చిర్ల జగ్గిరెడ్డి

నారావారి సారా ఏరులై పారుతోంది

- నకిలీ మద్యంతో తాళిబొట్లు తెంచుతున్న చంద్రబాబు
- వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు చిర్ల జగ్గిరెడ్డి



నకిలీ మద్యంపై క్లిప్పింగ్‌లను ప్రదర్శిస్తున్న పార్టీ జిల్లా అధ్యక్షుడు జగ్గిరెడ్డి, జక్కంపూడి విజయలక్ష్మి

రావులపాలెం: రాష్ట్రంలో నారావారి సారా ఏరులై పారుతోందని, ఆ మద్యం తాగి ప్రజలు ప్రాణాలు కోల్పోతున్నారని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి అన్నారు. గురువారం రావులపాలెం వైఎస్సార్ సీపీ కార్యాలయంలో ఆయన పార్టీ ముఖ్య నేతలతో కలసి విలేకరుల సమావేశం నిర్వహించారు. పార్లమెంట్ జిల్లా పరిశీలకురాలు జక్కంపూడి విజయలక్ష్మి, పార్టీ రాష్ట్ర కార్యదర్శులు కర్రి పాపారాయుడు, చింతలపాటి శ్రీనివాసరాజు, పాటి శివకుమార్, చెల్లుబోయిన శ్రీనివాసరావు హాజరయ్యారు. నకిలీ మద్యం బాటిళ్లు, కల్తీ మద్యంపై వివిధ దినపత్రికల్లో వచ్చిన కథనాల క్లిప్పింగ్‌లను వారు ప్రదర్శించారు. ఈ సందర్భంగా జగ్గిరెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో మహిళల తాళిబొట్లు తెంచేలా చంద్రబాబు నకిలీ మద్యం విక్రయాలు సాగిస్తున్నారని దుయ్యబట్టారు. కొత్తపేట నియోజకవర్గంలో మద్యం దుకాణంలో రూ.190కు దొరికే మద్యం, బండారు వారి బెల్ట్ షాపులో రూ.230కు విక్రయిస్తున్నారని విమర్శించారు. అలాగే నియోజకవర్గంలో యూరియా దొరకదు కానీ, నకిలీ మద్యం మాత్రం పుష్కలంగా లభ్యమవుతుందన్నారు. మద్యంలో స్థానిక కూటమి నాయకుడి అవినీతి గుర్రం పరుగెత్తుతుందని అన్నారు. నకిలీ మద్యంపై కూటమి ప్రభుత్వం, ఎల్లో మీడియా కలసి వాస్తవాలను వక్రీకరిస్తూ ప్రచారం చేస్తున్నాయన్నారు. మద్యంపై లైవ్ డిటెక్టర్ టెస్ట్‌కు జోగి రమేష్ సిద్ధంగా ఉన్నారని, మరి చంద్రబాబు, లోకేష్ కూడా సిద్ధమా అని ప్రశ్నించారు. కొత్తపేట నియోజకవర్గంలో ఈ ప్రభుత్వం ఎన్ని గ్రామాలకు స్వచ్ఛమైన నీరు ఇచ్చిందో తెలియదు గాని, ప్రతి గ్రామానికి చీప్ లిక్కర్ మాత్రం బాగా అందిస్తుందని వైఎస్సార్ సీపీ పార్లమెంట్ నియోజకవర్గ పరిశీలకురాలు జక్కంపూడి విజయలక్ష్మి అన్నారు. ఇటువంటి పాలనపై స్థానిక ఎమ్మెల్యే సత్యానందరావు సిగ్గుపడాలని విమర్శించారు. ఎన్నికల ముందు కన్న తండ్రిలా పరిపాలిస్తానన్న చంద్రబాబు ఇప్పుడు కసాయి తండ్రిలా మారారని దుయ్యబట్టారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్యే పాముల రాజేశ్వరీదేవి, జెడ్పీటీసీ సభ్యులు గూడపాటి రమాదేవి, బోణం సాయిబాబు, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు సాకా ప్రసన్నకుమార్, వైఎస్సార్ సీపీ ఎస్సీసెల్ నాయకుడు కప్పల శ్రీధర్, ఆత్రేయపురం పార్టీ మండల కన్వీనర్ ముదునూరి శ్రీనివాసరాజు తదితరులు పాల్గొన్నారు.

వచ్చే నెల 22న అమలాపురం జెడ్పీ స్కూల్ వార్షికోత్సవం



కుడుపూడి సూర్యనారాయణరావు, ఎమ్మెల్సీ

అమలాపురం టౌన్: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 150వ వార్షికోత్సవాన్ని వచ్చే నెల 22న పూర్వ విద్యార్థుల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు ఆ పాఠశాల పూర్వ విద్యార్థి, ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణరావు వెల్లడించారు. అమలాపురం హైస్కూల్ సెంటర్‌లోని తన క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్సీ గురువారం మీడియాతో మాట్లాడారు. వార్షికోత్సవ వేడుకలకు మాజీ ఉప రాష్ట్రపతి ఎం.వెంకన్నాయుడు, ఒడిశా గవర్నర్ కంభంపాటి హరిబాబు, ఆంధ్రప్రదేశ్ అధికార భాషా సంఘ అధ్యక్షుడు యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ ముఖ్య అతిథులుగా హాజరవుతారని చెప్పారు. ముఖ్యంగా ఈ పాఠశాలలో చదివి నేడు ఉన్నత పదవులు, ఉద్యోగాలు నిర్వహిస్తున్న పూర్వ విద్యార్థులను కూడా ఆహ్వానించామన్నారు. నవంబర్ 22న సాయంత్రం నుంచి పాఠశాల వార్షికోత్సవ వేదికపై ప్రముఖ ప్రవచనకర్తలు చాగంటి కోటేశ్వరరావు, గరికపాటి నరసింహారావుల ప్రవచనాలు కూడా ఏర్పాటు చేసినట్లు చెప్పారు. అలాగే పలు సాంస్కృతి ప్రదర్శనలు ఉంటాయన్నారు. ఓ పండుగలా వేడుకలు నిర్వహిస్తున్నామన్నారు. ఎవరికైనా ఆహ్వానం అందకపోతే కార్యక్రమం మనదన్న భావనతో పూర్వ విద్యార్థులంతా హాజరు కావాలని ఎమ్మెల్సీ పిలుపునిచ్చారు.

విద్యార్థుల్లో క్రమశిక్షణ పెంచాలి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ మహేష్ కుమార్

అమలాపురం రూరల్: ఆశ్రమ పాఠశాలల విద్యార్థులతో విపాసన జ్ఞాన సాధన చేపట్టి క్రమశిక్షణ, చదువుల పట్ల ఆసక్తి పెంచుతున్నట్లు కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ వెల్లడించారు. గురువారం అమలాపురంలోని కలెక్టరేట్‌లో సాంఘిక, బీసీ సంక్షేమ వసతి గృహాల ప్రిన్సిపాల్స్, హెచ్‌ఎంలతో సమావేశం నిర్వహించారు. మూడు నెలల విపాసన జ్ఞాన సాధన కార్యక్రమాల ఆనా పానా పురోగతిపై సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి వ్యక్తి జీవితంలో మానసిక స్థైర్యాన్ని పెంపొందించుకునేందుకు ధ్యానం చేయాలన్నారు. విద్యార్థులు రోజూ ఉదయం, సాయంత్రం 10 నిమిషాల పాటు జ్ఞాన ధ్యానం చేయాలన్నారు. విపాసన ఆచార్య నిపుణుడు ప్రహ్లాద మాట్లాడుతూ విద్యార్థుల్లో ఏకాగ్రత పెంచడం ద్వారా జీవితంలో మెరుగైన స్థాయికి ఎదుగుతారన్నారు. జేసీ టి.నిశాంతి, సమగ్ర శిక్ష ఏపీసీ జి.మమ్మీ పాల్గొన్నారు.

క్రీడా స్ఫూర్తి చాటాలి

విద్యార్థుల్లో క్రీడా స్ఫూర్తి చాటేలా కోనసీమ క్రీడోత్సవాలు నిర్వహించాలని కలెక్టర్ మహేష్ కుమార్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో విద్యాశాఖ, మున్సిపల్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ నవంబర్ మొదటి వారంలో ప్రాథమిక స్థాయి క్రీడా పోటీలను మండల స్థాయిలోనే పూర్తి చేయాలని, 6వ తరగతి నుంచి ఇంటర్ వరకూ క్రీడా పోటీలను జిల్లా స్థాయిలో నవంబరు 12, 13 ,14 తేదీల్లో స్థానిక జీఎంసీ బాలయోగి స్టేడియంలో నిర్వహించాలని ఆదేశించారు. 6, 7, 8 తరగతులు జూనియర్స్‌గా, పది, ఇంటర్ తరగతులు సీనియర్స్ బ్యాచ్‌గా విభజించామన్నారు. అండర్– 14, 17 కేటగిరీల్లో అథ్లెటిక్స్, బ్యాడ్మింటన్, కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, వెయిట్, పవర్ లిఫ్టింగ్ వంటి పోటీలు నిర్వహిస్తారన్నారు. మున్సిపల్ కమిషనర్ వి.నిర్మల్ కుమార్, జిల్లా సైన్స్ అధికారి జీవీఎస్ సుబ్రహ్మణ్యం, ఉప విద్యాశాఖ అధికారి సూర్యప్రకాశ రావు, సీఎంఓ బీవీ సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

సత్యదీక్షలకు నేడు శ్రీకారం



అన్నవరం: ఈ నెల 22వ తేదీ నుంచి ప్రారంభం కానున్న కార్తిక మాసంలో సత్యదేవుని సన్నిధికి లక్షలాదిగా తరలివచ్చే భక్తులను దృష్టిలో ఉంచుకుని రత్నగిరిపై ఏర్పాట్లు చురుకుగా జరుగుతున్నాయి. ఏటా కార్తికానికి ముందు వచ్చే సత్యదేవుని జన్మనక్షత్రం మఖ నాడు ప్రారంభమయ్యే సత్యదీక్షలు శుక్రవారం ప్రారంభం కానున్నాయి. ఈ సందర్భంగా సత్యదేవుడు, అనంతలక్ష్మీ సత్యవతీదేవి అమ్మవారు, శంకరుల మూలవిరాట్‌లకు తెల్లవారుజామున పంచామృతాభిషేకం చేస్తారు. అనంతరం సత్యదీక్షలు ప్రారంభమవుతాయి. స్వామి సన్నిధిలోనే అర్చకులతో మాలలు వేయించుకుని, భక్తులు ఈ దీక్షలు చేపడతారు. అలా వీలు కాకపోతే ఏదైనా దేవాలయంలో అర్చకుల ద్వారా, ఇంట్లో తల్లి ద్వారా మాల ధరించి ఈ దీక్ష చేపట్టే వీలుంది. 27 రోజుల అనంతరం నవంబర్ 13న స్వామివారి జన్మనక్షత్రం మఖ నాడు సత్యదేవుని సన్నిధిలో ఇరుముడి సమర్పించి, దీక్ష విరమణ చేయాలి. అనంతరం సత్యదేవుని వ్రతమాచరించి, స్వామిని దర్శించడంతో దీక్ష పూర్తవుతుంది.

18 రోజులు, 9 రోజులు చేపట్టే అవకాశం

కాగా, 27 రోజుల దీక్ష చేపట్టే అవకాశం లేని వారు 18 రోజులు, 9 రోజులు కూడా చేపట్టవచ్చు. అయితే దీక్ష విరమణ మాత్రం నవంబర్ 13న మాత్రమే చేయాలి. 18 రోజుల దీక్షను ఈ నెల 26న, 9 రోజుల దీక్షను నవంబర్ 4న స్వీకరించవచ్చు. నవంబర్ 12వ తేదీ రాత్రి రత్నగిరిపై సత్యదీక్ష స్వాములతో సత్యదేవుని పడిపూజ నిర్వహిస్తారు.

ప్రచార లోపం

ఏటా సత్యదీక్షల గురించి కనీసం 15 రోజుల ముందే సత్యరథం ద్వారా జిల్లాలో పెద్ద ఎత్తున ప్రచారం నిర్వహించేవారు. అలాగే, ఏజెన్సీలో సత్యదీక్ష చేపట్టే గిరిజన స్వాములకు దీక్షా వస్త్రాలు పంపిణీ చేసేవారు. ఈ ఏడాది ఎందువల్లనో కానీ సత్యదీక్షలపై పెద్దగా ప్రచారం చేయలేదు. వారం రోజులు ముందు మాత్రమే సత్యరథంతో ప్రచారం చేయించారు. దీక్షా వస్త్రాల పంపిణీ కూడా ఆలస్యంగానే ప్రారంభించారు. దీనిపై పలువురు భక్తులు అసంతృప్తి వ్యక్తం చేశారు. కాగా, దీక్షలు చేపట్టే వారికి దేవస్థానం తగు ఏర్పాట్లు చేయాలని భక్తులు కోరుతున్నారు.

హోటళ్లపై ఆకస్మిక దాడులు



ఓ హోటల్‌లో ఆహారాన్ని పరిశీలిస్తున్న ఫుడ్ సేఫ్టీ అధికారి రామయ్య, కమిషనర్ నిర్మల్‌కుమార్

అమలాపురం టౌన్: అమలాపురంలోని మాంసాహార హోటళ్లపై ప్రజల నుంచి వస్తున్న ఫిర్యాదులపై మున్సిపాలిటీతో పాటు ఫుడ్‌సేఫ్టీ అధికారులు స్పందించారు. పట్టణంలోని ప్రధాన హోటళ్లయిన విష్ణుశ్రీ, జీకే గ్రాండ్‌లపై ఫుడ్ సేఫ్టీ అధికారి వై.రామయ్య, మున్సిపల్ కమిషనర్ వి.నిర్మల్‌కుమార్ తమ సిబ్బందితో గురువారం ఆకస్మికంగా దాడులు చేశారు. విష్ణుశ్రీ హోటల్‌లో పారిశుధ్య నిర్వహణ బాగోలేదని రామయ్య అన్నారు. దీనిపై ఆ హోటల్ యాజమాన్యానికి నోటీసు జారీ చేసి, రూ.5 వేల జరిమానా విధించారు. జీకే గ్రాండ్‌లో కొన్ని లోపాలపై ఆ హోటల్ యాజమాన్యానికి సూచనలు చేశారు. ఇటీవల పలు మున్సిపల్ కౌన్సిల్ సమావేశాల్లో ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణరావుతోపాటు పలువురు కౌన్సిలర్లు పట్టణంలో కలుషిత ఆహారం అధికమైందని ఆందోళన వ్యక్తం చేసిన సందర్భాలు ఉన్నాయి. దీనికి తోడు అమలాపురంలోని ఓ హోటల్ పలావు ప్యాకెట్‌లో మండ్ర కప్ప అవశేషాలు ఉన్నట్లు సోషల్ మీడియాలో బుధవారం ప్రచారం జరగడంతో ఈ దాడులు చేసినట్లు సమాచారం. కార్యక్రమంలో మున్సిపల్ ఏఈ వెంకటేష్, వార్డు సచివాలయాల శానిటేషన్ సెక్రటరీలు వంకాయల సతీష్, కె.ఈశ్వరరావు, మున్సిపల్ శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

అంబాజీపేట కొబ్బరి మార్కెట్



కొబ్బరి రకం	ధర (రూ.ల్లో)
కొత్త కొబ్బరి (క్వింటాల్)	20,000 – 22,500
కొత్త కొబ్బరి (రెండో రకం)	10,500 – 12,000
కురిడీ కొబ్బరి (పాతవి)	
గండేరా (వెయ్యి)	30,000
గటగట (వెయ్యి)	28,000
కురిడీ కొబ్బరి (కొత్తవి)	
గండేరా (వెయ్యి)	29,000
గటగట (వెయ్యి)	27,000
నీటికాయ	
పాత (ముక్కుడు)కాయ (వెయ్యి)	23,000 – 25,000
కొత్త (పచ్చి)కాయ (వెయ్యి)	23,000 – 25,000
కొబ్బరి నూనె (15 కిలోలు)	5,250
కిలో	350

క్లుప్తంగా

తాండవ నదిలో మునిగి వ్యక్తి మృతి



శ్రీను మృతదేహం వద్ద రోదిస్తున్న బంధువులు

కోటనందూరు: తాండవ నదిలో మునిగి ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన అల్లిపూడి గ్రామంలో చోటుచేసుకుంది. ఆ వివరాల్లోకి వెళ్తే.. అల్లిపూడి ఎస్సీ పేటకు చెందిన వడ్లమూరి శ్రీను (36) బుధవారం స్నానం చేసేందుకు సమీపంలోని తాండవ నదిలోకి దిగగా, ప్రమాదవశాత్తూ నీటిలో మునిగిపోయాడు. అప్పటి నుంచి శ్రీను ఆచూకీ కోసం స్థానికులు గాలించగా, గురువారం ఉదయం అతని మృతదేహం కనిపించింది. సమాచారం అందుకున్న స్థానిక పోలీసులు ఘటనా స్థలికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. మృతుడి భార్య వడ్లమూరి సంధ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై రామ్మకృష్ణ తెలిపారు.

పాలనపై పేదవి విరుపు

- కూటమి ప్రభుత్వంలో సంక్షేమం గాలికి
- సంపద కాదు సమస్యలు సృష్టిస్తున్న వైనం
- ఉపాధి కోసం వలసలు వెళ్తున్న బడుగులు
- గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలోనే సుస్థిరాభివృద్ధి
- నేడు అంతర్జాతీయ పేదరిక నిర్మూలన దినోత్సవం



వైఎస్సార్ సీపీ పాలనలో ఇంటి వద్దే రేషన్ సరకులు అందుకుంటున్న లబ్ధిదారులు (ఫైల్)



అంగరలో చేనేత పనిలో మహిళ

కపిలేశ్వరపురం: జీవితం పూలపాన్పు కాకపోయినా పట్టెడన్నానికి లోటు లేకుండా సాగిపోతే చాలనుకునే వారెందరో.. పేద, మధ్యతరగతి ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపర్చాల్సిన బాధ్యత ప్రభుత్వానిదే. ప్రస్తుత 'కూటమి' పాలనలో పేదల బతుకులు రోజురోజుకూ దయనీయంగా మారుతున్నాయి. సంపద సృష్టిస్తానంటూ కబుర్లు చెప్పిన కూటమి అగ్రనేతలు అధికారంలోకి వచ్చాక పేదలను సమస్యల సుడిగుండంలోకి నెట్టేస్తున్నారు. శుక్రవారం అంతర్జాతీయ పేదరిక నిర్మూలనా దినోత్సవం సందర్భంగా 'సాక్షి' ప్రత్యేక కథనం ఇది.

ఉమ్మడి జిల్లాలో అన్నం పెట్టే వరి సాగు భూమి ఎక్కువగానే ఉంది. పండ్లు, కూరగాయల తదితర ఉద్యాన పంటలు పండే లంక, మెట్ట ప్రాంతమూ అధికమే. గౌతమి, వశిష్ట గోదావరి నదుల నుంచి పుష్కలమైన సాగునీరు లభ్యత ఇక్కడి ప్రత్యేకత. పారిశ్రామిక ప్రగతికి ప్రాథమిక భూమిక ఉమ్మడి జిల్లా.. ఇంత ప్రాధాన్యం ఉన్నా పేద, మధ్య తరగతి ప్రజలు ఆర్థిక, సామాజిక సమస్యలతో సతమతమవుతున్నారు. గత టీడీపీ, ప్రస్తుత కూటమి ప్రభుత్వంలో పేదల జీవితాలు తీసికట్టుగా మారాయి. తమ ప్రభుత్వం రాగానే సంపద సృష్టిస్తామని, ఇంటికో ఉద్యోగమిస్తామని ప్రజలను కూటమి నేతలు నమ్మించారు. 15 నెలల వారి పాలనలో కీలకమైన హామీలు ఆచరణకు నోచుకోలేదు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో కల్పించిన ఉపాధి అవకాశాలను సైతం కనుమరుగు చేశారు. కాకినాడ జిల్లాలో 445 గ్రామ సచివాలయాల పరిధిలో 9,015 మంది, 175 వార్డు సచివాలయాల పరిధిలో 3,257 మంది మొత్తం 620 సచివాలయాల పరిధిలో 12,272 మంది వలంటీర్లు ఉండేవారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో 512 సచివాలయాల పరిధిలో 9,581 మంది, తూర్పుగోదావరి జిల్లాలో 119 వార్డు, 393 గ్రామ మొత్తం 512 సచివాలయాల పరిధిలో 9,117 మంది వలంటీర్లు సేవలందించేవారు. వారందరికీ రూ.10 వేల గౌరవ వేతనం ఇస్తామంటూ ఎన్నికల ముందు కూటమి ప్రభుత్వం నమ్మబలికి అధికారంలోకి వచ్చాక తొలగించింది. ఇంటింటికీ రేషన్ సరకులు అందజేసేందుకు ఉద్దేశించిన వేలాది మంది ఎండీయూ ఆపరేటర్లను తీసేసింది. ఇలా ఆయా కుటుంబాలకు ఉపాధిని దూరం చేసింది.

గతమెంతో ఘనం

2019లో అధికారంలోకి వచ్చిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం రాష్ట్రంలోని పేదల జీవన ప్రమాణాలను మెరుగుపర్చే లక్ష్యంతో వ్యవస్థాపరమైన కార్యాచరణ చేసింది. సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లుగా పటిష్ట చర్యలు తీసుకుంది. ప్రతి కుటుంబానికీ ఏదొక ప్రభుత్వ పథకం ద్వారా క్రమం తప్పకుండా ఆర్థిక లబ్ధి చేకూర్చింది. సచివాలయ, వలంటీర్ వ్యవస్థలను తీసుకొచ్చి వ్యవస్థాపరమైన సంక్షేమాన్ని, ఉద్యోగ కల్పనకు కృషి చేసింది. మహిళా మార్టులను ఏర్పాటు చేసి ఉపాధి, మార్కెట్ అవకాశాలను మెరుగుపరిచింది. పేద అక్క చెల్లెమ్మలకు రూ.5 లక్షల విలువైన ఇంటి స్థలాన్ని అందజేసే లక్ష్యంతో తూర్పుగోదావరి జిల్లాలో 431, కాకినాడ జిల్లాలో 241 లేఅవుట్లలో సుమారు 90 వేల ఇళ్ల పట్టాలను అందించింది.

చదువుకు సాయం కరవు

ఉమ్మడి జిల్లాలో వేలాది ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాలయాలు ఉన్నాయి. కోనసీమ జిల్లాలో 608 పాఠశాలలు, 70 కళాశాలలు, తూర్పుగోదావరి జిల్లాలో 635 పాఠశాలలు, 115 కళాశాలలు, కాకినాడ జిల్లాలో 300 పాఠశాలలు, 80 కళాశాలలు ఉన్నాయి. ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇన్‌స్టాల్మెంట్లు చెల్లించక ఇంజినీరింగ్ విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. కూటమి ప్రభుత్వం తొలి ఏడాది తల్లికి వందనం ఆర్థిక సాయాన్ని ఆపేసింది.

సాయం అందక వలసలు

కూటమి వచ్చాక ప్రభుత్వం నుంచి అందాల్సిన పథకాలు చాలా వరకూ నిలిచిపోయాయి. తొలి ఏడాదిలో రైతులకు అన్నదాతా సుఖీభవ, విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ ఎగ్గొట్టారు. చేనేత కార్మికుల కుటుంబానికి ఇస్తామన్న రూ.25 వేలు ఇవ్వనేలేదు. ఇలాంటి పరిస్థితుల నేపథ్యంలో గ్రామీణ పేదలు పట్టణ ప్రాంతాలకు, ఇతర వృత్తులకు వలస పోతున్నారు. మండపేట, రామచంద్రపురం నియోజకవర్గాల్లోని చేనేత కార్మికులు ఇతర వృత్తుల్లోకి మళ్లిపోవడం ఉదాహరణ.

కొనలేం.. తినలేం

ప్రస్తుతం నిత్యావసర సరకుల ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. కూరగాయల ధరలు ఒకొక్కటిగా పెరిగిపోతున్నాయి. ఎండుమిర్చి రూ.180 నుంచి రూ. 220, వెల్లుల్లి రూ. 240 నుంచి రూ.350 ధరలు పెరిగాయి. కూటమి ప్రభుత్వం వచ్చాక రేషన్ దుకాణాల్లో ఫిబ్రవరి నుంచి కందిపప్పు సరఫరా నిలిచిపోయింది.

ప్రచారానికే ప్రాధాన్యం



ఆధునిక సమాజంలో పేదల పరిస్థితులు మెరుగుపడాలంటే ప్రభుత్వం వ్యవస్థాపరమైన కృషి చేయాలి. కూటమి ప్రభుత్వం వచ్చాక వ్యవసాయం, పాడి పరిశ్రమ, చిన్న, మధ్యతరగతి పరిశ్రమల ఏర్పాటు తదితర రంగాల్లో పటిష్టమైన కార్యాచరణ లేదు. ప్రచార కార్యక్రమాలకే ప్రాధాన్యం ఇస్తున్నారు.

–ఎం.గౌరవ్, పిఠాపురం, సామాజిక కార్యకర్త

సదా వేంకటేశం.. స్మరామి స్మరామి



వాడపల్లిలో గజ వాహనంపై స్వామివారికి ఊరేగింపు



బ్రహ్మోత్సవాల్లో శక్తివేషాల ప్రదర్శన

- వైభవంగా వాడపల్లి వెంకన్న బ్రహ్మోత్సవాలు
- అశేషంగా తరలివచ్చిన భక్తజనం

కొత్తపేట: సదా వేంకటేశం.. స్మరామి స్మరామి.. అంటూ శ్రీవారిని కొలుస్తూ సాగుతున్న బ్రహ్మోత్సవాలు ఆబాలగోపాలాన్ని మురిపిస్తున్నాయి. కోనసీమ తిరుమల వాడపల్లి క్షేత్రంలో శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వర స్వామివారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఏడోరోజు గురువారం ప్రత్యేక పూజలు జరిగాయి. అశేష సంఖ్య భక్తజనం తరలి వచ్చి వేదపండితుల మంత్రోచ్చారణల మధ్య కార్యక్రమాలను తిలకించి తన్మయత్వం చెందారు. రాజాధిరాజ అలంకరణలో గజ వాహనంపై ఊరేగిన శ్రీవారిని వీక్షించి పరవశించిపోయారు. దేవదాయ – ధర్మదాయ శాఖ డిప్యూటీ కమిషనర్, దేవస్థానం ఈఓ నల్లం సూర్యచక్రధరరావు పర్యవేక్షణలో వైఖానస ఆగమ శాస్త్రం ప్రకారం వేద పండితుడు ఖండవిల్లి రాజేశ్వర వరప్రసాదాచార్యులు ఆధ్వర్యంలో ఆలయ ప్రధాన అర్చకుడు ఖండవిల్లి ఆదిత్య అనంత శ్రీనివాస్, అర్చకులు, వేద పండితులు ఉదయం నుంచి రాత్రి వరకూ విశేష పూజలు, హోమాలు, బ్రహ్మోత్సవ కార్యక్రమాలు నిర్వహించారు. ఈఓ చక్రధరరావు, ఉత్సవ కమిటీ చైర్మన్ ముదునూరి వెంకట్రాజు దంపతులు పూజాదికాలు నిర్వహించారు. ఎమ్మెల్యే బండారు సత్యానందరావు దంపతులు ముఖ్య అతిథులుగా పాల్గొని, స్వామి, అమ్మవార్లకు పట్టువస్త్రాలు సమర్పించారు. ఉదయం నుంచి పుణ్యాహవచనం, అష్ట కలశారాధన, లక్ష తులసిపూజ, తిరుప్పావడ సేవ, ప్రధాన హోమాలు, దిగ్దేవతా బలిహరణ, నీరాజన మంత్రపుష్పం, సాయంత్రం స్వస్తివచనం, ప్రధాన హోమాలు, దిగ్దేవతా బలిహరణ తదితర కార్యక్రమాలు నిర్వహించారు.

గజ వాహనంపై ఊరేగిన శ్రీవారు

బ్రహ్మోత్సవాల్లో భాగంగా రాత్రి స్వామివారిని రాజాధిరాజ అలంకరణలో గజవాహన సేవ అద్భుతంగా సాగింది. శ్రీవారిని గజ వాహనంపై అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. భక్తుల గోవింద నామస్మరణ నడుమ వేద పండితుల వ్యాఖ్యోపన్యాసంతో ఈ వేడుక కన్నుల పండువగా సాగింది. రాజాధిరాజ అలంకరణ అనేది ఒక దేవతామూర్తిని 'రాజులకు రాజుగా' (రాజాధిరాజ), చక్రవర్తిగా అలంకరించే అత్యంత వైభవమైన అలంకారం. ఇది దేవాలయాల్లోని బ్రహ్మోత్సవాల వంటి ఉత్సవాల సమయంలో నిర్వహిస్తారు. దేవుని గజ (ఏనుగు) వాహనంపై ఊరేగిస్తారు. వాడపల్లి బ్రహ్మోత్సవాల్లో ఈ వాహన సేవ నిర్వహించారు. దైవత్వం యొక్క సర్వోన్నత అధికారాన్ని, వైభవాన్ని కీర్తించడం ఈ సేవ ఉద్దేశం. ఈ సేవ భక్తుల కోలాహలం నడుమ విశేషంగా సాగింది. పలువురు ప్రముఖులు, నాయకులు బ్రహ్మోత్సవ కార్యక్రమాల్లో పాల్గొన్నారు.



స్వామివారికి తిరుప్పావడ సేవ

కిడ్నాప్ కేసులో నిందితుల అరెస్ట్

పిఠాపురం: ఓ యువతి కిడ్నాప్ కేసులో ముగ్గురిని గురువారం అరెస్ట్ చేసినట్లు ఎస్సై నౌడు రామకృష్ణ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. అనకాపల్లి జిల్లా పాయకరావుపేట మండలం శ్రీరాంపురం గ్రామానికి చెందిన ఓ యువతి, కర్రి వంశీతో పాటు మరో బాలుడితో ప్రేమ వ్యవహారం జరిపింది. దీనిపై ఆ ముగ్గురి మధ్య కొంత కాలంగా వివాదం నడుస్తుంది. ఈ నేపథ్యంలో ఏర్పడిన గొడవ కారణంగా గత శనివారం ఉదయం ఆ బాలుడు స్కూటర్‌పై ఎక్కించుకుని ఆ యువతిని తుని సమీపంలో రాజానగరం బీచ్ వద్దకు తీసుకెళ్లాడు. అక్కడ మరో కారులో ఆ యువతిని బలవంతంగా ఎక్కించుకుని బాలుడు, కర్రి వంశీ, అతని స్నేహితుడు రాజు కలసి ఆమెను బెదిరించారు. ప్రేమ వ్యవహారంలో ఎవరో ఒకరిని తేల్చుకోవాలని భయపెట్టి ఆమెను చేతులతో కొట్టి చుట్టుపక్కల ప్రాంతాలు తిప్పుతూ అన్నవరం, కత్తిపూడి మీదుగా చేబ్రోలు గ్రామానికి తీసుకు వచ్చారు. అక్కడ నిర్మానుష్యంగా ఉన్న హైవే పక్కన ఉన్న మట్టి రోడ్డులోకి తీసుకు వెళ్లారు. అప్పటికే అక్కడ సిద్ధంగా ఉన్న సాంబ అని వేరే వ్యక్తితో ఆమెను బెదిరించారు. దీంతో ఆమె కేకలు వేయగా సంఘటనను గమనించిన చుట్టుపక్కల వారు పోలీస్ స్టేషన్‌కు ఫోన్ చేసి సమాచారం ఇచ్చారు. వెంటనే పోలీసులు వెళ్లి ఆ యువతని రక్షించి, నిందితులను అదుపులోకి తీసుకున్నారు. ఈ కేసులో బాలుడు, కర్రి వంశీ, అతని స్నేహితుడు రాజులను అరెస్టు చేశామని ఎస్సై తెలిపారు. ఇదే కేసులో మరో నిందితుడు సాంబ పరారీలో ఉన్నాడన్నారు.

ఎస్‌బీఐ బ్రాంచ్‌ను ముట్టడించిన డ్వాక్రా మహిళలు

స్వాహా చేసిన రూ.95 లక్షల రికవరీకి డిమాండ్



వేళంగిలో ఎస్‌బీఐ బ్రాంచ్ వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న కూరాడ డ్వాక్రా మహిళలు

కరప: డ్వాక్రా సంఘాల సొమ్మును స్వాహా చేసిన బ్యాంక్ సీసీపై చర్యలు తీసుకోకపోవడంపై వేళంగిలోని ఎస్‌బీఐ బ్రాంచ్‌ను గురువారం కూరాడ గ్రామ డ్వాక్రా మహిళలు ముట్టడించారు. తమ సంఘాల నుంచి దోచుకున్న రూ.95 లక్షలను రికవరీ చేయాలని, అక్రమాలకు పాల్పడిన బ్యాంక్ సీసీపై, ఇందుకు సహకరించిన యానిమేటర్లపై ఇంతవరకూ ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని మహిళలు ఆగ్రహం వ్యక్తం చేశారు. కూరాడలో 106 మహిళాశక్తి సంఘాలు ఉన్నాయి. వీరి నుంచి ముగ్గురు యానిమేటర్లు సంఘాల పొదుపు, రుణాల వాయిదా సొమ్మును వసూలు చేసేవారు. వేళంగి ఎస్‌బీఐ బ్రాంచ్ కూరాడలో బీసీ పాయింట్ ఏర్పాటు చేసి, కరస్పాండెంట్‌గా చిన్నం ప్రియభారతిని నియమించారు. ముగ్గురు యానిమేటర్లలో ఒకరు చిన్నం మంగ బ్యాంక్ సీసీ భారతి తల్లి కావడం, ఆమెకు మిగిలిన ఇద్దరు యానిమేటర్లు ఆలపాటి బేబీ, ఆచంట మాధవి సహకరించడంతో డ్వాక్రా సొమ్మును కాజేశారు. బ్యాంక్ సీసీ, యానిమేటర్లు ముగ్గురు ఏకమై పొదుపు, వాయిదాల సొమ్మును బ్యాంక్‌కు చెల్లించకుండా పక్కదారి పట్టించి, సొంతానికి వాడుకున్నారు. ఇది గత నెలలోనే బయటపడినా ఇంతవరకూ అధికారుల నుంచి స్పందన కరవైందని మహిళలు వాపోయారు. తమకు న్యాయం చేయాలని వేళంగిలోని ఎస్‌బీఐ బ్రాంచ్‌ను ముట్టడించారు. కరప పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేశామన్నారే కానీ ఇంతవరకూ ఎవరూ తమ గ్రామానికి విచారణకు రాలేదన్నారు. డీఆర్‌డీఏ పీడీ వచ్చాక చర్యలు తీసుకుంటారని ఏపీఎం ఎంఎస్‌బీ దేవి చెప్పారని, ఆయన వచ్చారో, లేదో తెలియడం లేదని మహిళలు వాపోయారు. అవినీతికి పాల్పడిన బ్యాంక్ సీసీ భారతిని విధుల నుంచి తొలగించాలని, స్వాహా చేసిన సొమ్మును రికవరీ చేసి డ్వాక్రా గ్రూపులకు చెల్లించాలని అసిస్టెంట్ మేనేజర్ ఎస్.ఫాల్గుణరావుకు వినతిపత్రం అందజేశారు. దీనిపై ఉన్నతాధికారులకు నివేదిస్తామని ఆయన చెప్పడంతో డ్వాక్రా మహిళలు వెనుతిరిగారు.

వైభవంగా తిరుమంజన సేవ

మామిడికుదురు: దోషాల పరిహారార్థం చేపట్టిన పవిత్రోత్సవాలు అప్పనపల్లి శ్రీబాల బాలాజీ స్వామి క్షేత్రంలో రెండో రోజు గురువారం ఘనంగా జరిగాయి. చతుస్థానార్చనలతో ప్రారంభమైన పవిత్రోత్సవాల్లో అగ్ని ప్రతిష్ఠాపన, పవిత్రారోహణ పూజలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. బాల బాలాజీ స్వామితో పాటు పద్మావతీదేవి, ఆండాళ్‌తాయార్ అమ్మవార్లకు 27 కలశాలతో పంచామృతాలు, సుగంధ ద్రవ్యాలు, 11 రకాల పండ్ల రసాలు, ఉద్గ జలాలతో నిర్వహించిన స్నపన తిరుమంజన సేవ ఆద్యంతం ఆకట్టుకుంది. వేద మంత్రాలు, భక్తుల గోవింద నామస్మరణల నడుమ ఈ కార్యక్రమం సాగింది. వీటితో పాటు ప్రాయశ్చిత హోమం, నివేదన, తీర్థ ప్రసాద గోష్ఠి, చతుస్థానార్చనలు, నివేదన, మంగళా శాసనం పూజలు శాస్త్రోక్తంగా జరిపించారు. ఇందులో భాగంగా ఏర్పాటు చేసిన ఆధ్యాత్మిక కార్యక్రమాలు భక్తులను ఆకట్టుకున్నాయి. ఆలయ కార్యనిర్వహణాధికారి ఎం.సత్యనారాయణరాజు ఆధ్వర్యంలో శ్రీమాన్ త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చినజీయర్ స్వామివారి శిష్య బృందం, గుడివాడకు చెందిన చలమచర్ల మురళీకృష్ణమాచార్యులు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాలను అర్చక స్వాములు నిర్వహించారు.



శ్రీబాల బాలాజీ స్వామికి స్నపన తిరుమంజన సేవ చేస్తున్న అర్చకులు

ఆ రూ.5.88 లక్షలు ఎక్కడివి?

విచారణ చేపట్టిన ఏసీబీ అధికారులు



ఈ స్థలం సర్వేకే డబ్బులు డిమాండ్ చేసింది

అమలాపురం రూరల్: తీగ లాగితే డొంక కదిలినట్లు అమలాపురం తహసీల్దార్ అవినీతిపై ఏసీబీ అధికారులకు మరిన్ని ఆధారాలు లభ్యమైనట్లు తెలుస్తోంది. ఓ వ్యక్తి స్థలం సర్వే విషయంలో తహసీల్దార్ పి.అశోక్‌ప్రసాద్ రూ.లక్ష లంచం డిమాండ్ చేయడం, కార్యాలయ డేటా ఆపరేటర్, జనుపల్లి వీఆర్ఏ పుప్పాల రాము మధ్యవర్తిత్వంలో రూ.50 వేల బేరం కుదరడం, తర్వాత ఆ భూయజమాని ఏసీబీ అధికారులను ఆశ్రయించడం, ఏసీబీ ట్రాప్‌లో తహసీల్దార్, డేట్ ఆపరేటర్ రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడిన పరిణామాలు తెలిసిందే. తహసీల్దార్ కార్యాలయంపై ఏసీబీ దాడులు జరిగినప్పుడు లంచం తీసుకుంటున్న రూ.50 వేలతో పాటు అక్కడ రూ.5.88 లక్షలు దొరకడం గమనార్హం. అక్కడ అనధికారికంగా ఉన్న రూ.5.88 లక్షలపై ప్రత్యేక దృష్టిపెట్టి, అసలు ఈ నగదు ఎక్కడిది..? ఎలా వచ్చింది...? అనే కోణంలో ఏసీబీ అధికారులు దర్యాప్తు చేపట్టారు. తహసీల్దార్‌ను అరెస్ట్ చేసిన తర్వాత బుధవారం రాత్రి పొద్దుపోయాక ఏసీబీ అధికారులు తహసీల్దార్ ఇంటికి వెళ్లి విచారించారు. ఆ ఇంట్లో ఉన్న తహసీల్దార్ ల్యాప్‌టాప్‌ను అధికారులు సీజ్ చేశారు. అలాగే అధికారులు అమలాపురం ఆర్డీఓ కార్యాలయానికి వెళ్లి అక్కడా పలువురిని విచారించారు. తహసీల్దార్, డేటా ఎంట్రీ ఆపరేటర్‌ను తొలుత రాజమహేంద్రవరానికి తరలించారు. అక్కడి నుంచి విజయవాడలోని ఏసీబీ కోర్టుకు తీసుకు వెళ్లినట్లు సమాచారం. తహసీల్దార్ కార్యాలయంలో ఉన్న రూ.5.88 లక్షల నగదు దీపావళి దుకాణాల ఏర్పాటు గురించి లంచంగా వసూలు చేసిన సొమ్మని తెలిసింది. ఏసీబీ అధికారులు కూడా ఆ దిశగానే దర్యాప్తు చేస్తున్నట్లు సమాచారం.

చోరీ కేసులో నిందితురాలి అరెస్ట్



అమలాపురం పోలీసులు రికవరీ చేసిన బంగారు నగలు

అమలాపురం టౌన్: స్థానిక ఆర్టీసీ బస్ స్టేషన్‌లో ఓ మహిళ హ్యాండ్ బ్యాగ్ నుంచి బంగారు నగలు, కొంత నగదు కాజేసిన పశ్చిమగోదావరి జిల్లా భీమవరం పట్టణం అప్పారావు పేటకు చెందిన జడ్డు ముత్యవతిని పట్టణ పోలీసులు గురువారం అరెస్ట్ చేశారు. ఆమె నుంచి 66.270 గ్రాముల బంగారు నగలు రికవరీ చేసినట్లు పట్టణ ఎస్సై ఎన్ఆర్ కిషోర్‌బాబు తెలిపారు. ఈ నెల 4న అమలాపురం ఆర్టీసీ బస్ స్టేషన్‌లో ముమ్మిడివరానికి చెందిన ప్రస్తుతం రాజమహేంద్రవరంలో ఉంటున్న వెలిగంటి లీలావతి హ్యాండ్ బ్యాగ్‌ను ముత్యవతి చాకచక్యంగా దొంగిలించిందని ఎస్సై అన్నారు. బ్యాగ్‌లో దాదాపు రూ.5.50 లక్షల విలువైన బంగారు నగలు మాయమయ్యాయి. తన హ్యాండ్ బ్యాగ్‌ను, అందులోని బంగారు నగలు, కొంత నగదు ఎవరో గుర్తు తెలియని వ్యక్తి దొంగిలించారని బాధితురాలు లీలావతి అదే రోజు పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీనిపై అమలాపురం డీఎస్పీ టీఎస్ఆర్‌కే ప్రసాద్ పర్యవేక్షణలో లోతైన దర్యాప్తు చేశారు. నిందితురాలు ముత్యవతిని అరెస్ట్ చేసి బంగారు నగలు స్వాధీనం చేసుకున్నామని ఎస్సై చెప్పారు. ఆమెను అమలాపురం ఏజేఎఫ్‌సీఎం కోర్టులో గురువారం హాజరుపరిచామన్నారు.

ఇంటి తాళాలు పగులగొట్టి చోరీ

పి.గన్నవరం: స్థానిక హైస్కూల్ రోడ్డులో గుర్తుతెలియని వ్యక్తులు ఓ ఇంటి తాళాలు పగులగొట్టి 16 గ్రాముల బంగారు ఆభరణాలు, 15 తులాల వెండి వస్తువులు చోరీ చేసిన ఘటనపై గురువారం కేసు నమోదు చేసినట్టు ఎస్సై బి.శివకృష్ణ తెలిపారు. హైస్కూల్ రోడ్‌లో నివసిస్తున్న ఏడిద వీర వెంకటలక్ష్మి కుటుంబం హైదరాబాద్‌లో వ్యాపారం చేసుకుంటూ జీవనం సాగిస్తుంది. గత ఆగస్టులో ఆమె పి.గన్నవరంలో జరిగిన వివాహ కార్యక్రమానికి ఇక్కడకు వచ్చింది. బంగారు ఆభరణాలు, వెండి వస్తువులను ఇంట్లోనే ఆమె వదిలి హైదరాబాద్ వెళ్లిపోయింది. ఈ క్రమంలో ఈ నెల 9న ఆమె ఇంటి తాళాలు పగులగొట్టి ఉండటాన్ని స్థానికులు గమనించి వెంకటలక్ష్మికి సమాచారం అందించారు. చోరీపై ఆమె ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై వివరించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

కపిలేశ్వరపురం (మండపేట): మండపేట మండలం ద్వారపూడిలో గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో పిఠాపురానికి చెందిన సిద్దనాతి వెంకటేష్ (37) మృతి చెందాడు. పిఠాపురంలో మిఠాయి దుకాణంలో వెంకటేష్ పనిచేస్తూ ఉపాధి పొందుతున్నాడు. ఇప్పనపాడు లింగరాజుపేటలో ఉంటున్న అతని తండ్రి అనారోగ్యం బారిన పడడంతో చూసేందుకు వెంకటేష్ బైక్‌పై వస్తుండగా ప్రమాదం సంభవించింది. ద్వారపూడిలో కొత్త పెట్రోల్ బంక్ సమీపంలో ఎదురుగా వస్తున్న లారీ ఢీకొట్టడంతో వెంకటేష్ తలకు తీవ్ర గాయమై అక్కడికక్కడే మృతి చెందాడు. ఆయనకు భార్య, కుమారుడు ఉన్నారు. మృతదేహాన్ని మండపేట పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. రూరల్ సీఐ పి.దొరరాజు పర్యవేక్షణలో ట్రైనీ ఎస్ఐ సోమేంద్ర కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వేధింపులు తాళలేక వివాహిత ఆత్మహత్య

తొండంగి: వివాహం జరిగి ఏడాది పూర్తి కాకుండానే భర్తతో పాటు అత్తింటి వేధింపులకు ఓ వివాహిత ఆత్మహత్యకు పాల్పడిన సంఘటనపై కేసు నమోదు చేసినట్టు ఎస్సై బి.జగన్మోహన్‌రావు గురువారం తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. శ్రీకాకుళం జిల్లా పాతపట్నం మండలం తిడ్డిమి గ్రామానికి చెందిన గొర్లి శిరీష (23), ఏనుగుతల ప్రదీప్‌కుమార్‌కు సుమారు ఐదు నెలల కిందట వివాహం జరిగింది. కాగా ప్రదీప్‌కుమార్ ఒంటిమామిడిలో దివీస్ కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాడు. గోపాలపట్నంలో ఓ ఇంట్లో అద్దెకు దిగారు. కొద్ది రోజులుగా భార్యాభర్తల మధ్య మనస్పర్థలు ఏర్పడ్డాయి. కాగా బుధవారం సాయంత్రం ప్రదీప్‌కుమార్ ఉద్యోగానికి వెళ్లిన అనంతరం అత్తింటివారి వేధింపులే కారణమంటూ సూసైడ్ నోట్ రాసి ఆమె ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడిందని ఎస్సై తెలిపారు. వివాహిత తల్లిదండ్రులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు సంఘటనా స్థలాన్ని పరిశీలించి మృతదేహాన్ని తుని ఏరియా ఆస్పత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించామన్నారు.